**కథ**

# గెలుపు

చీకటిపడి చాలాసేపే అయింది.

కార్యాలయం నుంచి మెల్లగా నడుస్తూ స్తున్న ప్రభు నాలుగురోడ్ల కూడలి వద్దకు వచ్చాడు.

సరిగ్గా అదే క్షణంలో ఎర్రదీపం వెలిగిం.

ఎన్నో కార్లు, ఆటోలూ, మోటారు సైకిళ ...ఒక్కసారి కీచుమంటూ రొదచేస్తూ ఆగిపోయాయి. అవసరం లేకపోయినా ప్రభు డా ఆగిపోయాడు. ట్రాఫిక్ సిగ్నల్స్‌వేపు చూస్తూ ఉండిపోయాడు.

ఒకవైపు అందమైన ఆకుపచ్చ రంగులో మెరుస్తూ...

మరొకవైపు భయపెట్టే ఎరుపురంగులో

దీపాలు...వెలుగులు కళ్ళల్లో మెత్తగా గుచ్చుకుంటు అతను ఆలోచనలో పడ్డాడు.

తిన్నగా వెళ్ళి బస్సెక్కితే కొన్ని కిలోమీటర్ల దూరంలో ఇల్ల పక్కకి తిరిగితే అతి కొద్దిదూరంలోనే...దగ్గరలోనే స్వర్గం. కొ గంటలపాటు సుల్తాన్. ఏవేవో రంగుల లోకాల్లో రమణీం విహారాలు.

''అటే తిరుగు'' అంది అంతరాత్మ.

''వొద్దు. అటు తిరగకు. తిన్నగా ఇంటికెళ్ళు. శ్రీరా డిలా, మంచి భర్తలా, మనిషిలా'' హెచ్చరించింది వివే ఉపదేశిస్తూనే.

అంతరాత్మ అదోలా నవ్వింది.

''ఏముంది ఇంట్లో? అసలది ఇల్లేనా? ఔట్‌హౌస్. హౌసంటే అంతరార్థం తెలుసా? పూర్వకాలంలో స్త్రీ ఔటాఫ్ డోర్స్ అయినప్పుడు...అదేలే మెన్సెస్ పీరియ ఎవరినీ ముట్టుకోకూడదని, చాపా చెంబుతో ఉండేంద ఇంటికి విడిగా కట్టించిన చిన్నిల్లు. కాలక్రమంలో వే సర్వెంట్ క్వార్టర్స్. ఇప్పుడు నువ్వలాంటి-ఔట్‌హౌస్‌లో వు న్నావు. గదిన్నర. ఆ గదిలోకి గాలి రాదు, పంకా తి తే తప్ప. వెలుగురాదు, దీపం వేస్తే తప్ప. ఇరుకు గది, వ కి గది, ఊపిరాడని గుహ.

మరి...మలుపుతిరిగితే కొద్దిదూరంలోనే స్వర్గపు వ . మధురమైన రుచులు, మబ్బుల్లో విహారం, మైమ పు. ఎయిర్ కండిషండ్ చల్లదనం. నీ ఆజ్ఞకోసం ఎదురు సే సుఖాల క్యూ. అందమైన ఆహ్లాదకరమైన వ వ రణం...ఊరించింది మనసు. మలుపు తిరగమంది.

వివేకం ''నువ్వు పెళ్లయినవాడివి. ఇంటి దగ్గర ఇ లు నీ కోసం చూస్తుంటుంది'' మరచిపోవొద్దంటూ హె రించింది.

''ఇల్లాలు! నిజంగా ఎదురుచూసేది నీ కోస నా? కాదు. నువ్వు తెచ్చే డబ్బుకోసం. నువ్వంటే ప్రేమే టే, నీమీద అంత ఇష్టమే అయితే అలా ఎందుకుంట నీ ముందు? నిన్ను కట్టుకున్నందుకు నిశ్శబ్దంగా పశ్చాత్త పడు తున్నట్లు ఆ పొరపాటుకి చింతిస్తున్నట్లు, ఆ విచారాన్న టినీ ముఖంలో చూపుతూ మౌనంగా వింటూ నిన్ను చి పు చూసే ఇల్లాలు చూడామణి కూడా నీ శత్రువర్గపు నిషే. ఆమె కూడా నువ్వు జయించవలసిన మనిషే. ఇక ఔట్ హౌస్! నీకేమి లేవో నువ్వు అనుభవిస్తున్న దరిద్ర దౌ ర్భాగ్యం ఎత్తి చూపుతూ వెక్కిరించే అది- నీ ఇల్లు. అది ఇ కాదు జైలే. నీకది ఊపిరాడనివ్వదు. ఉత్సాహంగానూ, ఉల్లాసంగానూ ఉండనివ్వదు. మరచిపోకు. ఇల్లొక నరకకూపం. ఇల్లాలొక నరరూప రాక్షసి. సారీ ప్రభూ! నువ్వు వివాహ విషయంలోనూ ఓడిపోయినవాడివే, దురదృష్టవంతుడివే'' అతనిని తూట్లు పొడిచింది మనసు. ఔను అనుకున్నాడతను. అదే అదనని మనసు విజృంభించింది. కాలి ఉండగానే ఇనుము వంచగలగడం సాధ్యం. మెత్తబడినప్పుడే మనిషిని జయించడం సులభం అని మనసుకి తెలుసు.

''నీ చుట్టూ చూడు. ఖరీదయిన కార్లు, విలాసవంతమైన వాహనాలు, మోటార్ సైకిళ్ళు. వాటిమీద యజమానులయిన వాళ్ళు. వాళ్లు నీకంటే తెలివైన వాళ్ళా?''

''కాదు'' గొణుక్కున్నాడు ప్రభు.

''నీకంటే సమర్థులా?''

''కాదు.''

''మరి వాళ్లకా కార్ల ఐశ్వర్యమేమిటి? నీకీ కాళ్ల నడకల దౌర్భాగ్యమేమిటి? ఎందుకు?'' సూటిగా సూది గుచ్చుకుంటున్నట్లు ప్రశ్న.

''దానికి జవాబు తెలిస్తే ఇకనేం?'' గొణుక్కున్నాడు ప్రభు.

''అంతవరకూ దేనికి? నీ బాస్‌నే తీసుకో. అతని విద్యార్హతేమిటి?''

''మెట్రిక్యులేషన్.''

''మరి నీది?''

''డిగ్రీ, టైప్‌రైటింగ్‌లో డిప్లొమా.''

''మరి అతని సంపాదనెంత? నీ జీతమెంత?''

ప్రభు సిగ్గుపడిపోయాడు. చిన్నబుచ్చుకున్నాడు. ఐతే అదే క్షణంలో అతని మెదడు కలుగచేసుకుంది అతనిమీద జాలిపడి సహాయానికి వస్తున్నట్లు.

''అన్ని పోలికలూ మంచివికావు. కొన్ని కొన్ని పోలికలు అనర్థదాయకాలు కూడా. అవి మనిషిని శాంతంగా, సుఖంగా, స్వచ్ఛంగా ఉండనీయవు. మనిషి బతకడానికి వేదాంతం కూడా కొంతవరకు అత్యవసరమే. ముఖ్యంగా మధ్య తరగతి వాళ్లకి. ఎవరి అదృష్టం వాళ్ళదనుకోవడంలో సుఖముంది.''

మెదడును పూర్తిగా చెప్పనివ్వకుండానే ప్రభులోని రెండో మనిషి అడ్డుపడిపోయాడు.

''పోలిక లేకపోతే మానవ జీవితానికి ఏ ఆనందమూ లేదు. నీకంటే తక్కువ వాళ్లని చూసినప్పుడు నీలో కలిగే గర్వానికి విలువ కట్టగలవా? మరొకరికంటే నీ ఎక్కువతనం ఎంత థ్రిల్లింగ్‌గా వుంటుంది. పోటీలలో విజేతలుగా రావడానికి మనుషులు వెర్రివాళ్ళయి అంత కృషి చేస్తారా? విజయం విశేషమైన ఆనందం కలిగిస్తుంది మనిషికి. అందుకే దానికోసం వెంపర్లాడతాడు మనిషి. ప్రేమంటే మాత్రం మరొకరి మనసునో హృదయాన్నో గెలుచుకోవడం కాదూ?.''

కాదనలేకపోయాడు ప్రభు. దాంతో రెండో మనిషికి మరింత బలమొచ్చేసింది.

''కాకిలా కలకాలం బతకడంకంటే హంసలా ఆరునెలలు బతకడమే ఘనమని ఎంత అనుభవంమీద చెప్పారో. ఎంత సత్యమో అది. ఐనా నిన్నేమీ చనిపోమనడంలేదు సరికదా జీవించమనే అంటున్నాను. నెలంతా ఎలాగూ నీరసపు బతుకే, నిస్పృహే, బానిసత్వమే. విసుగు రాదూ ఆ బ్రతుకు మీద? విరక్తి కలగదూ? ఎందుకీ దరిద్రగొట్టు బతుకు. ఇంతకంటే చస్తే మేలనిపించదూ? కానీ బలవంతంగా చావడం తప్పూ, పాపం కదా! అందుకే నేను చెప్పేదేమిటంటే మలుపు తిరిగేయ్. రెండు మూడు గంటలు మరో లోకంలో విహరించు. బతుకు కోరుకునే మార్పునియ్యి. రేపట్నుంచి మళ్లీ మామూలే. నిన్ను నెల్లాళ్ళూ బతికించి ఉంచేది ఈ రెండు మూడు గంటలే. కాకపోతే ఖర్చవుతుంది. అంతేగా? ఎవరేం చెప్పినా చాలా రకాల సుఖాలు ఆనందాలు వట్టినే రావు. ఊరికే వచ్చి వళ్లో పడవు. అయినా నువ్వు డబ్బుని సంపాదిస్తున్నావా? నిన్ను డబ్బు సంపాదిస్తోందా?''

''ఔను. నేనే డబ్బుని సంపాదిస్తున్నాను'' అంగీకరించాడు.

''అప్పుడప్పుడేనా మార్పు లభిస్తూ ఉండాలి. మనిషి తన కోరిక ప్రకారం కొన్ని గంటలపాటేనా జీవిస్తుండాలి. ప్రతి మనిషికీ తనకంటే తక్కువవాడు, తనకి లోకువయినవాడు ఒక్కడేనా వున్నాడనిపించకపోతే అతను బతకలేడు. నీ పేరేమో ప్రభు. కానీ, నువ్వెవరికయినా ప్రభువ్వా? ఊహూ! నీ బాస్ ముందు బానిసవి. నీ భార్య ముందు అసమర్థుడివి. కార్యాలయంలో అయినా నిన్నెవరూ లెక్క చేయరు. నీ మాట ఎవరూ వినరు. ఔనా? కాదా? పేరుకే ప్రభువిగానీ నిజానికి సేవకుడికంటే అన్యాయం. ఎందుకంటే సేవకుడికేనా తనకి లోకువగా అతని భార్య వుంటుంది. నీ దురదృష్టం నీ భార్య కూడా నిన్ను గొప్పగా చూడదు. అందుకే అప్పుడప్పుడు నువ్వొ ఓ మనిషి మీద గెలుపు తీసుకుంటుండాలి'' నొక్కి వక్కాణించాడు రెండోమనిషి.

'ఔను' అనుకున్నాడు ప్రభు.

సరిగ్గా అప్పుడే ఆకుపచ్చ దీపం వెలిగింది. కార్ల బారులు కదలసాగాయి.

''ఆటో!'' పిలిచాడతను ఖాళీగా వెళ్తున్న దానిని చూసి. ఆటో ఎక్కుతూ మనసులో అనుకున్నాడు- ఈ క్షణం నుంచి కొన్ని గంటలవరకూ నేను నిజమైన ప్రభుని. నా కలల...కోరికల రూపాన్ని.

''ఆ బార్ ముందాపు.''

నిజానికది వైన్ షాపు. కానీ దాని వెనుక అనధికారికంగా నడిపే బారు.

ఆపి అదోలా చూస్తూ ''ఈ మాత్రం దూరానికేనా?'' అడిగేశాడు నోరు జారి.

''అది నీకనవసరం'' కటువుగా అని టిప్‌తోసహా చెల్లించి బార్ లోపలికి నడిచాడు.

''వెల్‌కమ్ సర్'' దణ్ణం పెట్టాడు గేటు కాపలావాడు.

లోపలికి వెళ్లిన ప్రభు కళ్ళు ఎవరికో సమో వెదికాయి ఆత్రంగా.

ఆ బేరర్ తనకంటే పొట్టి, సన్నం. అంతేకాదు, చాలా వినయంగా ఉంటాడు. నమ్రతతో ప్రవర్తిస్తాడు. తనని నిజంగా ప్రభుని లాగే చూస్తాడు.

''యస్ సర్. వెల్‌కమ్ సర్. మీ ప్లేసు ఖాళీగానే వుంది సర్. వెళ్లి కూర్చోండి. నేను నిముషంలో వచ్చేస్తాను.''

చిన్న రూములో ఇద్దరి కోసం ఒక టేబులు. రూము చిన్నదయినా ఎయిర్ కూల్డ్. నీటుగా వుంటుంది. గోడలకి బొమ్మలు.

''అరె! ఇవాళ కొత్త బొమ్మ వచ్చిందే!'' అనుకున్నాడతను గోడవైపుచూసి. బొమ్మలో ఒక మేడ. అచ్చంగా తన ఔట్‌హౌస్ తాలూకు మేడలాగే వుంది.

ఆ మేడ మీది వాటా. తన కలల్లో అదొకటి. ఎప్పటికేనా ఆ వాటాలో దిగాలని. తన ఔట్‌హౌస్ అద్దె మూడువందలు. ఆ మేడ మీది వాటా అద్దె పదిహేనువందలు. తన నెల జీతంలో సగం.

ఛీ...ఛీ...ఇక్కడికి వచ్చి కూడా పాత ఆలోచనలు పాడు ఆలోచనలు ఏమిటి? వెనుకటి గుణమేల మాలు అన్నట్లు ఇక్కడికి రావడమే ఆధిక్యత ప్రదర్శించుకోవడం కోసం. ఆ సర్వర్ ముందు తను చాలా రిచ్‌గా ప్రవర్తించి అతని మీద గెలుపు తీసుకుని ఆ సంతృప్తితో మరో నెల బతుకును ఈడవడానికి. తను నెల్లాళ్లపాటు నికృష్ట జీవితం గడిపేది ఈ కొన్ని గంటలకోసమే.




''యస్ సర్'' వచ్చాడు బేరర్ ఆర్డర్ ఇమ్మన్నట్లు చూస్తూ.

ప్రభు విలాసంగా నవ్వాడు.

''ఈ బొమ్మ మా మేడకి ఫోటోలా వుందోయ్

''మీ మేడ ఇలాగే వుంటుందా సార్? ఆహా. ...ందుకడిగానంటే నేనివాళే దిగిన మేడ కూడా అచ... ఇలాగే వుంటుంది. అందుకే సార్ సాయంత్రం ఈ బొ... కనబడగానే కొనేశాను. దీనినిప్పటికి తగిలించానిక్కడ. డ... టీ అయిపోగానే నాతో తీసుకుపోతాను.''

''ఇది మీ మేడలాగా వుంటుందా?''

''ఔను సార్. ఈవేళే దిగాం. రాజేంద్రన... మూడో వీధి. ప్రశాంతి నిలయం బోర్డు. ఔట్‌హౌస్, మేడమీద వాటా. పదిహేనువందలయితే ఏం చాలా పోష్‌గా వుంటుంది.''

నివ్వెరపోయాడు ప్రభు. ఆ ఔట్‌హౌస్‌లోనే తనుండేది.

''నీకంత రాబడుందా?''

''వుంటుంది సార్. మీలాటి వాళ్ళిచ్చే టిప్స్ తక్కువగా వుండవుకదా. సర్...అన్నట్లు మా మేడ ఔట్‌హౌస్‌లో అచ్చంగా మీలానే ఎవరో...ఉదయం ఇంట్లో దిగే హడావుడిలో ఆయన్ని పలకరించి పరిచయం చేసుకోలేకపోయాను. రేపు వారిని పరిచయం చేసుకోవాలి. అన్నట్లు ఇవాళ నేను కొత్తింట్లో దిగిన శుభసందర్భంగా మీకు బీర్ సమర్పించుకుందామనుకుంటున్నాను. ప్లీజ్. కాదనకండి. బీర్ తెస్తాను'' అని బేరర్ లోపలికి వెళ్ళడమేమిటి, ప్రభు క్షణంలో బయటకొచ్చేశాడు బార్ నుంచి.

రోడ్డుమీదకి వచ్చాక రెండు నిర్ణయాలు తీసుకున్నాడు.

మొదటిది- జన్మలో ఈ బార్‌కి రాకూడదు.

రెండవది- అతి తొందరలో మరో ఔట్‌హౌస్‌కి మారిపోవాలి. ఇప్పుడున్న దానికి వీలయినంత దూరంగా...బహుదూరంగా.

**ఇచ్ఛాపురపు రామచంద్రం**

★